క్లుప్తంగా

బెల్టుషాప్‌లను మూసి వేయించాలి

కృష్ణా: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామాల్లోని బెల్టు షాపులను మూసివేయిస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆనంద్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ.. మండలంలోని ప్రతి గ్రామంలో పదికి పైగా బెల్టుషాపులు నిర్వహిస్తున్నారని, వాటి మూలంగా ప్రజలు, మహిళలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని తెలిపారు.

శాంతియుతంగా సంబరాలు

కృష్ణా: కొత్త సంవత్సరం సంబరాలను మండల ప్రజలు శాంతియుతంగా నిర్వహించుకోవాలని, మద్యం తాగి రోడ్లపైకి వస్తే వారిపై చట్టపరమైన చర్యలతో పాటు కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ విజయ భాస్కర్ శనివారం హెచ్చరించారు. ఈ విషయంలో యువకులు ఎవరికీ ఇబ్బందులు కలగకుండా సంబరాలను చేసుకోవాలని సూచించారు.

ప్రాణాలు పోతున్నాయి.. స్పందించరా?

మాగనూర్: మండల పరిధిలోని అడవిసత్యరం హామ్లెట్ గ్రామమైన పెగడబండకు రోడ్డు సౌకర్యం లేక వారం రోజుల్లో ఇద్దరు మృతి చెందారని సర్పంచ్ జానకమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఉన్న ఎమ్మెల్యే రెండు పర్యాయాలు ఎన్నికల సందర్భంగా గ్రామానికి బీటీ రోడ్డు సౌకర్యం కల్పించాకే గ్రామంలోకి వస్తానని మాట ఇచ్చారని కాని అది ఎక్కడా అమలు కాలేదన్నారు. ప్రస్తుతం ఉన్న మట్టి రోడ్డు మొత్తం గుంతలమయంగా మారడంతో అత్యవసర సమయాల్లో ఇబ్బందులు తప్పడం లేదన్నారు. శుక్రవారం గ్రామానికి చెందిన హరిజన్ తిమ్మప్పకు గుండెపోటు రావడంతో ఆస్పత్రికి తీసుకెళ్తుండగా గుంతలరోడ్డు కారణంగా మధ్యలోనే ప్రాణాలు కోల్పోయాడని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. విషయంపై ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి స్పందిస్తూ.. గ్రామాలకు కనీసం రోడ్డు సౌకర్యం కల్పించకపోవడం చాలా దారుణమైన అంశమని అన్నారు. ఈ విషయంపై అధికారులతో చర్చించి అతి త్వరలోనే పెగడబండకు రోడ్డు సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం మృతి చెందిన వారి కుటుంబానికి సానుభూతి తెలియజేశారు. వారి కుటుంబాలకు ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

క్రీడాపోటీల కరపత్రం విడుదల

కోస్గి: స్వామి వివేకానంద జయంత్యుత్సవాల సందర్భంగా జనవరి 3వ తేదీ నుంచి అన్ని కళాశాలల విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు హిందూ వాహిని ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు అందుకు సంబంధించిన కరపత్రాలను నాయకులతో కలిసి విడుదల చేశారు. బాలబాలికలకు వేర్వేరుగా నిర్వహించే ఈ పోటీలకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. భరత్‌గౌడ్, అంజి, చింటు పలువురు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

ధన్వాడ: మండలంలోని రామకిష్టాయిపల్లిలో రైతు చిన్న కృష్ణయ్యకు చెందిన గేదె శనివారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. మేత కోసం వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో మృతి చెందిందని, దీని దాదాపు రూ.60వేలు ఉంటుందని రైతు తెలిపారు. మృతి చెందిన గేదెకు పశువైద్యాధికారులు పంచనామ నిర్వహించి ట్రాన్స్‌కో అధికారులకు సమాచారం అందించినట్లు రైతు తెలిపారు.

స్కూల్ అసిస్టెంట్లకు న్యాయం చేయాలి

గద్వాల: ఇటీవల నిలిచిపోయిన మల్టీజోన్-2లోని జెడ్పీహెచ్ఎస్ గెజిటెడ్ హెడ్‌మాస్టర్ పోస్టులకు తక్షణమే ప్రమోషన్ కౌన్సిలింగ్ నిర్వహించి, మల్టీజోన్-2లోని జెడ్పీహెచ్ఎస్ స్కూల్ అసిస్టెంట్లకు న్యాయం చేయాలని స్కూల్ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షుడు గొబ్బూరి గోపీనాథ్, ప్రధాన కార్యదర్శి నాగరాజులు డిమాండ్ చేశారు. శనివారం నిర్వహించిన స్కూల్ అసిస్టెంట్ల సమావేశంలో వారు మాట్లాడారు. ఎనిమిదేళ్లుగా ప్రమోషన్స్ ఊసేత్తకుండా కేవలం ఎన్నికల ముందు మల్టీజోన్-1లోని స్కూల్ అసిస్టెంట్లకు, మల్టీజోన్-2లోని ప్రభుత్వ పాఠశాలల స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు ఇచ్చి, మల్టీజోన్-2లోని జెడ్పీహెచ్ఎస్ స్కూల్ అసిస్టెంట్లకు మొండిచెయ్యి చూపారని ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే మార్చి నెలలో పదవీ విరమణ పొందే ఉపాధ్యాయులకు, 24 ఏళ్ల సర్వీసు పూర్తయి ఎటువంటి పదోన్నతులకు నోచుకోనివారు, అర్హతలున్న ఉపాధ్యాయులందరికీ అడహక్ ప్రమోషన్స్ ఇవ్వాలని కోరారు. ఉపాధ్యాయుల బదిలీలను పూర్తిచేయాలన్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

నవాబుపేట: మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యంపై పోలీసులకు శనివారం ఫిర్యాదు అందింది. వివరాలు ఇలా ఉన్నాయి.. లోకిరేవుకి చెందిన వెంకటేష్‌గౌడ్ పదేళ్లుగా మతిస్థిమితం సరిగా లేక తిరిగేవాడు. ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి వచ్చేవాడు. కాగా రెండు నెలల క్రితం అలాగే వెళ్లి ఇప్పటికీ తిరిగి రాలేదు. భార్య కృష్ణవేణి ఫిర్యాదుపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ ఆనంద్ తెలిపారు.

అన్ని వర్గాల సంక్షేమానికి కృషి



కృష్ణాలో..



చిట్యాలలో దరఖాస్తులు స్వీకరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ వనజ,పరిశీలించిన ప్రత్యేకాధికారి

మక్తల్: బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని జెడ్పీ చైర్‌పర్సన్ వనజ తెలిపారు. శనివారం మండలంలోని మాద్వార్, లింగంపల్లి, చిట్యాల, భూత్పూర్, నర్సిరెడ్డిపల్లి, టీకులపల్లిలో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 2,286 దరఖాస్తులు రాగా, రేషన్‌కార్డుల కోసం 532 వచ్చాయని అధికారులు తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారంటీ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఒకే దరఖాస్తులో రైతు భరోసా, మహాలక్ష్మి, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దరఖాస్తులు బయట ఎవరూ అమ్మొద్దని, ప్రజలకు తగిన వాటిని అధికారులు అందిస్తారని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన పథకాలు కోసం వచ్చిన ప్రజలకునేమాత్రం ఇబ్బందులు పెట్టొదన్నారు. కార్యక్రమంలో లక్ష్మారెడ్డి, జాన్‌సుధాకర్, ఎంపీపీ వనజ, తహసీల్దార్ సువర్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా: మండల కేంద్రంతో పాటు ఆలంపల్లి, ఐనాపూర్, ఖాన్‌దొడ్డిలో ప్రజాపాలన కార్యక్రమాన్ని మండల ప్రత్యేకాధికారి అంజయ్య పరిశీలించారు. ఎంపీడీఓ యశోద, తహసీల్దార్ దయాకర్‌రెడ్డి, ఏపీఎం రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బందులు లేకుండా దరఖాస్తులు తీసుకోండి

మరికల్: ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వస్తున్న దరఖాస్తులను పరిశీలించిన తర్వాతనే తీసుకోవాలని అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ సూచించారు. మండలంలోని రాకొండలో శనివారం ప్రజాపాలన దరఖాస్తులను పరిశీలించారు. తప్పులు లేకుండా దరఖాస్తులను పూరించాలని హెల్ప్‌డెస్క్ వారికి సూచించారు. జిన్నారం, పూసల్‌పహాడ్‌లో దరఖాస్తుల స్వీకరణ చేపట్టారు.



రాకొండలో దరఖాస్తుల వివరాలను తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్



అడవిసత్యరంలో దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్: స్థానిక మున్సిపాలిటీలో 16 వార్డుల్లో 984 దరఖాస్తులు వచ్చాయని కమిషనర్ బాల్‌రాం నాయక్ తెలిపారు. ఇతర దరఖాస్తులు 334 వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ పావని, వైస్ చైర్‌పర్సన్ అఖిలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలో నిడుగుర్తి, పెద్దజట్రం, పగిడిమారి, కొత్తపల్లి, నాగిరెడ్డిపల్లిలో అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. అవుసలోనిపల్లిలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలించారు. దరఖాస్తులకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

మాగనూర్: మండలంలోని అడవిసత్యారం, కొల్పూర్, మందిపల్లి, గురువలింగంపల్లిలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కొనసాగింది. అడవిసత్యరంలో రైతువేదిక వద్ద ప్రజాపాలన కార్యక్రమాన్ని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ జానకమ్మ, ఎంపీటీసీ శ్యామలాదేవి, ప్రత్యేకధికారి కృష్ణమచారి, ఎంపీడీఓ శశికళ, తహసీల్దార్ సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

ధన్వాడ: మండలంలోని రామకిష్టాయిపల్లి, కొండాపూర్, హన్మన్‌పల్లి, మందిపల్లి, గున్ముక్లలో గ్రామసభ నిర్వహించి అధికారులు దరఖాస్తులను స్వీకరించారు.

మద్దూరు: ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ విజయలక్ష్మి, జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహ ప్రజలకు సూచించారు. శనివారం భూనీడ్‌లో 636, కొమ్మురులో 352, నందిపాడ్‌లో 616, మోమినాపూర్‌లో 539, పెదిరిపాడ్‌లో 507 దరఖాస్తులు వచ్చినట్లు మండల ప్రత్యేకాధికారి జ్యోతి తెలిపారు.

నర్వ: మండలంలోని పాథర్చేడ్‌లో 1,148, ఎల్లంపల్లిలో 486 దరఖాస్తులను అందించినట్లు ఎంపీడీఓ సుదర్శన్, తహసీల్దార్ మల్లారెడ్డి తెలిపారు. కార్యక్రమాన్ని ప్రత్యేక అధికారి సుధాకర్‌రెడ్డి పర్యవేక్షించారు.



గున్ముక్లలో..



నందిపాడులో..



పాథర్చేడ్‌లో..

వేధింపుల నుంచి రక్షించడమే షీటీం లక్ష్యం



మాట్లాడుతున్న ఎస్‌ఐ శ్రీనివాసులు

కోస్గి: మహిళలు, బాలికలను వేధింపుల నుంచి రక్షించడమే షీ టీం ప్రధాన లక్ష్యమని, ఎవరైన వేధింపులకు గురైతే మౌనంగా భరించకుండా నేరుగా 100కు ఫోన్ చేయాలని ఎస్‌ఐ శ్రీనివాసులు సూచించారు. శనివారం గుండుమాల్ మండలంలోని బోగారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బాలికలు, మహిళల రక్షణ కోసం చేపడుతున్న షీటీం, బాల్య వివాహాల నిర్మూలన, మూఢనమ్మకాలు, సైబర్ నేరాలు, బ్యాంకు మోసాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ చదువుకునే వయస్సులో పిల్లలకు పెళ్లిళ్లు చేయడంతో వారి జీవితాలు నాశనమవుతున్నాయని, బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించి ఉన్నత ప్రయోజకులను చేయాలన్నారు. అనంతరం పోలీస్ కళాబృందం వారు ఆటపాటలతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సురేందర్ గౌడ్, శేఖర్, లింగన్న, కల్యాణి, రుక్యా నాయక్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య అక్షతలు



మక్తల్‌లో అక్షతల ఊరేగింపు

మాగనూర్: అయోధ్యలోని శ్రీరామ మందిరం ప్రాణ ప్రతిష్ట సందర్భంగా ఇంటింటికీ అక్షతల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వర్కూర్ యువకులు, గ్రామ పెద్దలు తెలిపారు. శనివారం మక్తల్ నుంచి తీసుకొచ్చిన అక్షతలు, ఇతర వస్తువులను గ్రామస్తులు ఊరేగింపుగా తీసుకు వచ్చి మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో పూజ అనంతరం వర్కూర్ గ్రామంలోని ఆంజనేయ స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు. రాములు, నర్సింహులు అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

మక్తల్: పట్టణంలో పురవీధుల గుండా శ్రీరామ అక్షతల ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో కొండయ్య, రాజు, మల్లికార్జున్, ఆశప్ప, రమేస్, సత్యనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దామరగిద్ద: అక్షతలను శనివారం స్థానిక వీరభద్రేశ్వర ఆలయంలో పంపిణీ చేపట్టారు. ఆయా గ్రామాల్లో రామాయలంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఇంటింటికీ అక్షతలు, శ్రీరామచంద్రుడి ఫొటో, కరపత్రాలు అందజేయనున్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



స్వపరిపాలన దినోత్సవంలో విద్యార్థులు

కోస్గి: గుండుమాల్ మండలంలోని బోగారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధిస్తూ స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కలెక్టర్‌గా శ్రావణి, డీఈఓగా శివ శంకర్, ఎంఈఓగా వైష్ణవి, హెచ్ఎంగా స్వాతితోపాటు 25 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. బోధనలో ప్రతిభ కనబర్చిన వారికి పాఠశాల తరుపున బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం సత్యనారాయణతోపాటు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం

నర్వ: బీఆర్ఎస్ కార్యకర్తలకు ఎల్లప్పుడు అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్తకు ఏ సమస్య వచ్చిన నిరంతరం అందుబాటులో ఉండి ఆదుకుంటానన్నారు. రాబోవు ఏ ఎన్నికలైన సమర్థంగా కలిసికట్టుగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. సమావేశంలో మహేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ జయరాములుశెట్టి, శ్రీనివాస్‌రెడ్డి, మండ్ల చిన్నయ్య నాయకులు పాల్గొన్నారు.

నేడు భక్తకనకదాస విగ్రహావిష్కరణ



పోస్టర్ విడుదల చేస్తున్న సంఘం సభ్యులు

కృష్ణా: మండల కేంద్రంలో ఆదివారం ఉదయం 11గంటలకు కురుమ కులస్తుల ఆరాధ్య దైవమైన భక్త కనకదాసుడి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నట్లు సంఘం మండల అధ్యక్షుడు మాలింగప్ప, నాగరాజ్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో విగ్రహ ఆవిష్కరణకు పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పీఠాధిపతి సిద్ధారామానందపురి మహాస్వామి, మాలింగరాయ మహారాయ, లింగ బీర దేవరు, కృష్ణా క్షీరాలింగేశ్వర పీఠాధిపతి వృషభలింగేశ్వర మహాస్వామి, పంచమ సిద్ధలింగా మహాస్వామి, క్షీరాలింగ మహాస్వామి, నింగప్పతాత ముడుమాల్, లింగప్పతాత గుర్లపల్లి హాజరవుతున్నారని తెలిపారు. ఆవిష్కరణకు రాష్ట్ర ప్రజలే కాక, కర్ణాటక, మహారాష్ట్రలోని కురుమ కులస్తులు వేలాది మంది హాజరవుతున్నారని తెలిపారు. ఉదయం క్షీరాలింగేశ్వర మఠం నుంచి డోళ్లు, భజంత్రీలతో గ్రామంలో ఊరేగింపుగా వెళ్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సురేష్, రెడ్డి, అమర్‌కుమార్ దీక్షిత్ పాల్గొన్నారు.

ముడుమాల్ ఉన్నత పాఠశాల సందర్శన



విద్యార్థులతో మాట్లాడుతున్న బృందం

కృష్ణా: మండలంలోని ముడుమాల్ ఉన్నత పాఠశాలను శనివారం జిల్లా సూపర్ సపోర్టివ్ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా వారు దినచర్య, పాఠ్య ప్రణాళిక, వార్షిక ప్రణాళిక, టీఎల్ఎం సాంకేతిక విజ్ఞానం తదితర అంశాలను పరిశీలించారు. ముఖ్యంగా ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులు మెరుగైన ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు.

భక్తిశ్రద్ధలతో మహాపడిపూజ



కలశ ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

ఊట్కూరు: మండల కేంద్రంలో ఆదివారం అయ్యప్ప మహాపడిపూజ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం స్థానిక శ్రీరామనగర్ ఆంజనేయస్వామి దేవాలయం నుంచి పురవీధుల్లో కలశ ఊరేగింపు చేపట్టారు. అనంతరం పూర్ణ పుష్కల అయ్యప్ప భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామికి పంచామృతాభిషేకం, అష్టోత్తరం, అలంకరణ, పడిపూజను చేపట్టారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



మక్తల్: రాష్ట్ర షూటింగ్ బాల్ పోటీలకు క్రీడాకారులు ఎంపికై నట్లు షూటింగ్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపాలం శనివారం తెలిపారు. ఎంపికైన క్రీడకారులు ఆదివారం మహబూబాబాద్ జిల్లాలో నిర్వహించే క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను పలువురు అభినందించారు.

పౌర హక్కులను కాపాడుకోవాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ దయాకర్‌రెడ్డి

కృష్ణా: మండలంలోని ఆలంపల్లిలో శనివారం పౌర హక్కులపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి పౌరుడు రాజ్యాంగం కల్పించిన తన హక్కులను కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ రామకృష్ణాదణి, మదన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



స్కిప్పింగ్ చేస్తున్న విద్యార్థినులు

అమరచింత: క్రీడలు మానసిక ఉల్లాసాన్నిస్తాయని ఎస్‌ఐ జగన్మోహన్ తెలిపారు. మాజీ అడ్వకేట్ జనరల్ దేశాయి ప్రకాష్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకొని శనివారం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు ఆటపోటీలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్‌ఐ విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడారు. ఈసందర్భంగా దేశాయి ప్రకాష్‌రెడ్డి సేవా సమితి అధ్యక్షుడు కలాంపాషా మాట్లాడుతూ కొన్నేళ్లుగా తమ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఆటపోటీల్లో గెలుపొందిన వారికి డిసెంబర్ 31న బహుమతులను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం బలరాముడు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కబడ్డీ పోటీలు

పెబ్బేరు రూరల్: మండల కేంద్రంలోని మాంటిస్సోరీ ప్లేవే స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి కబడ్డీ పోటీలు శనివారం మున్సిపల్ చైర్మన్ ఎద్దుల కరుణశ్రీ ప్రారంభించారు. ఈ పోటీలు సాయంత్రం ముగిశాయి. ఈ పోటీల్లో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో సీనియర్ విభాగంలో మాంటిస్సోరీ ప్లేవే స్కూల్ విద్యార్థులు ప్రథమ బహుమతి గెలుపొందగా, మోడల్‌స్కూల్ రెండో బహుమతి, జూనియర్ విభాగంలో మాంటిస్సోరీ ప్లేవే స్కూల్ విద్యార్థులు ప్రథమ, జెడ్పీహెచ్ఎస్ కంచిరావుపల్లి విద్యార్థులు రెండో బహుమతి సాధించారు. విజేతలకు పాఠశాల డైరెక్టర్ రాజేందర్‌గౌడ్ బహుమతులు అందజేశారు.

విద్యారంగ సమస్యలపై పోరాటం



జెండాను ఎగురవేస్తున్న నాయకులు

వనపర్తి టౌన్: విద్యార్థుల, విద్యా రంగ సమస్యల పరిష్కారానికి దశాబ్దాల నుంచి పోరాటాలు చేస్తున్న ఏకైక సంస్థ ఎస్ఎఫ్ఐ అని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆది అన్నారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) 54వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలోని సూర్య ఒకేషనల్ జూనియర్ కళాశాల ఎదుట భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం కలిసి ఉన్న జెండాను ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు మల్లేష్ ఎగురవేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రసాద్, భరత్, అవినాష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో షాపు దగ్ధం

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని 23వ వార్డు వల్లభ్‌నగర్‌లో మణిదీపిక లేడీస్ కార్నర్ అండ్ జనరల్ స్టోర్‌లో శుక్రవారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. కాంగ్రెస్ నాయకుడు నాగరాజు ఎమ్మెల్యే మేఘారెడ్డికి సమాచారం ఇవ్వగా ఆయన శనివారం షాపును పరిశీలించి, కాలిపోయిన షాపును పంచనామా చేసి రిపోర్ట్ ఇవ్వాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. త్వరలో ప్రభుత్వం తరుపున నష్టపరిహారం ఇస్తామని హామీ ఇచ్చి, షాపు యజమానురాలు స్వప్నకు ఎమ్మెల్యే రూ. 10వేల ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు బండారు శ్రీనివాస్‌గౌడ్ రూ.10వేలు అందించారు. కార్యక్రమంలో లక్కాకుల సతీష్, చీర్ల విజయచందర్, మన్నెంకొండ, కౌన్సిలర్లు విభూది నారాయణ, చీర్ల సత్యం, జయసుధ, సుమిత్ర, కోఆప్షన్ సభ్యురాలు ఖైరున్ షఫీ తదితరులు పాల్గొన్నారు.

డీఈఓను తొలగించాలి



ఫిర్యాదు చేస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: అక్రమాలకు పాల్పడుతున్న డీఈఓ రవీందర్‌ను వెంటనే విధుల నుంచి తొలగించాలని గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ నాయకులు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. డైట్ కళాశాలలో లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తూ సర్వీస్ రూల్స్‌కు విరుద్ధంగా డీఈఓగా ఆర్డర్ తెచ్చుకున్నారని ఆరోపించారు. వనపర్తిలో డీఈఓగా పలు అక్రమాలకు పాల్పడ్డారని, నారాయణపేటలో అక్రమాలకు పాల్పడినందుకు అప్పటి కలెక్టర్ వెంకట్రావ్ ఆయను విధుల నుంచి తొలగించారని అన్నారు. తర్వాత మళ్లీ మహబూబ్‌నగర్‌కు ఇన్‌చార్జ్ డీఈఓగా వచ్చారన్నారు. ప్రతి జిల్లాలోనూ అక్రమాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. విషయంపై స్పందించిన ఎమ్మెల్యే అవినీతిని ఉపేక్షించేదిలేదని, విచారణ చేయిస్తామని హామీ ఇచ్చారు.

బుడగ జంగాలకు ప్రాధాన్యత ఇవ్వాలి

దేవరకద్ర: ఎస్సీ రిజర్వేషన్లలో తమకు ప్రాధాన్యత కల్పించాలని బేడ బుడగ జంగాల హక్కుల పోరాట సమితి మండల కమిటీ అధ్యక్షుడు సిరిగిరి పరశురాం డిమాండ్ చేశారు. శనివారం దేవరకద్ర విద్యుత్ సబ్‌స్టేషన్ చౌరస్తాలో సమితి ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని పతాకావిష్కరణ చేసి మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.